
సాక్షి
ఒడిశా

గురువారం । 18 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.5,60,634
బంగారం 5 గ్రాముల 550 మిల్లీ గ్రాములు
వెండి 8 గ్రాముల 350 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు

తొలి ఏకాదశి పురస్కరించుకొని శ్రీజగన్నాథ, బలభద్ర, సుభద్రలు సునావేషంలో భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు.

– 8లో

కమల పూజారికి అస్వస్థత

పద్మశ్రీ కమల పూజారి అనారోగ్యంతో జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో బుధవారం చేరారు.

– 8లో



న్యూస్‌రీల్

ఈనెల 21 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

భువనేశ్వర్: రాష్ట్రంలో మెట్రిక్యులేషన్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. సంబంధిత అడ్మిట్ కార్డులు మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్‌ఈ) వెబ్‌సైట్ www.bseodisha.ac.inలో అందుబాటులో ఉన్నాయి. ఈ పరీక్షలు ఈనెల 31 వరకు కొనసాగుతాయని బోర్డు పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా 83 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించే మెట్రిక్ సప్లిమెంటరీ పరీక్షకు హాజరయ్యేందుకు 972 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. మరో 24,520 మంది విద్యార్థులు 121 కేంద్రాల్లో స్టేట్ ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ (ఎస్‌ఓఎస్‌సీ) పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యార్థులు పరీక్షకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా వివరాల కోసం బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నంబర్ 0761–2415 305 ను సంప్రదించవచ్చు.

‘ఆదివాసీ సమస్యలపై గళమెత్తాలి’



ఎమ్మెల్యే మనోహర్ రంధారి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం నియోజకవర్గం నుంచి ఎన్నికైన బీజేడీ ఎమ్మెల్యే మనోహర్ రంధారికి ఆ పార్టీ అదనపు బాధ్యతలు అప్పగించింది. బుధవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అందుకు తగ్గ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఆదివాసీల సమస్యలపై పార్టీ తరుపున గళమెత్తాలని నిర్దేశించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి బీజేడీ తరపున కేవలం రంధారి మాత్రమే గెలిపొందారు. ఈ జిల్లాలు మొత్తం గిరిజన ప్రాంతాలే. అంతేకాక రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి నిత్యానంద గొండో కూడా నబరంగ్‌పూర్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రంధారికి సూచనలు చేశారు.

ఇంటి పైకప్పు కూలి చిన్నారి మృతి



అవంతి కద్రక (ఫైల్)

రాయగడ: ఇంటి పైకప్పు కూలి ఒక చిన్నారి మృతి చెందిన ఘటన జిల్లాలో కల్యాణ సింగుపూర్ సమితి కొరప పంచాయతీలోని బెర్లాంగ్ గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి గ్రామానికి చెందిన కొమాసింగ్ కద్రక చిన్న కూతురు అవంతి కద్రక(5)గా గుర్తించారు. మంగళవారం సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో ఇంటి గడపలో ఆడుకుంటున్న చిన్నారిపై ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఊపిరాడక అవంతి అక్కడిక్కడే మృతి చెందింది. సంఘటన స్థలానికి కల్యాణ సింగుపూర్ ఐఐసీ నీలకంత బెహర చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం



సంఘటన స్థలం వద్ద కులసిక మృతదేహం, ప్రమాదానికి గురైన బైక్

రాయగడ: బైక్ అదుపుతప్పి లోయలో పడిపోయిన ఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి గ్రామ సమీపంలోని అమ్మవారి మందిరం వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కొలనార సమితి గడ్డిశెఖాల్ పంచాయతీలోని భేజా గ్రామానికి చెందిన శ్యాం కులసిక(27)గా గుర్తించారు. కల్యాణ సింగుపూర్ నుంచి రాయగడ వైపు అతివేగంగా వస్తుండగా అదుపుతప్పి పక్కనే ఉన్న లోయలో పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలకు గురైన అతడు సంఘటన స్థలం వద్దే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

నదిలో పడి వృద్ధుడు మృతి

కొరాపుట్: ఇంద్రావతి నదిలో పడి నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి దోహనా గ్రామ పంచాయతీ బైరాగి గుడ గ్రామానికి చెందిన రాంకాంత (60) దుర్మరణం పాలయ్యా డు. పశువులు మేపడానికి వెళ్లి నది వద్ద కాలకృత్యాలు తీర్చుకోవడానికి దిగి వరద నీటిలో కొట్టుకుపోయాడు. అనంతరం గ్రామస్తులు మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. నందా హండి జోన్–2 జిల్లా పరిషత్ సభ్యుడు అరుణ్ మిశ్ర సంఘటన స్థలానికి చేరుకొని పోలీసుల కు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.



రథాలపై బంగారు దేవుళ్లని దర్శనం చేసుకుంటున్న భక్తజనం

పులకించి.. ప్రణమిల్లి..!



సువర్ణ చక్రం

శ్రీమందిరం ఆవరణం అశేష భక్తజనంతో కిటకిటలాడింది. పసిడి వెలుగుల్లోని పురుషోత్తముడిని చూసి తరించేందుకు తనువెల్లా కనులు చేసుకొని భక్తులు ఎదురుచూశారు. సాయంత్ర 6 గంటల నుంచి రథాలపై పతిత పావనుడు స్వర్ణాలంకరణ శోభితుడై దర్శనమివ్వడంతో జన్మధన్యమైందని మురిసిపోయారు. దాదాపు రాత్రి 11 గంటల వరకు లక్షలాది మంది భక్తులు మనసారా బంగారు స్వామిని దర్శించుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు.

- పసిడి వెలుగుల్లో జగన్నాథుడు
- చూసి తరించిన భక్తజనం
- రాత్రి 11 గంటల వరకు దర్శనం



బలభద్ర స్వామి బంగారు మకుటం



రథంపై కనక కిరీటంతో దేవీ సుభద్ర



స్వర్ణ మకుటంతో పతిత పావనుడు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రథయాత్ర అంతిమ ఘట్టానికి చేరువైంది. దేవదేవుడు రథాలపై స్వర్ణ శోభితుడుగా భక్తులకు దర్శనమిచ్చాడు. బుధవారం రాత్రి 11 గంటల వరకు భక్తులకు ఈ దర్శనం లభించింది. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల మధ్య సుమారు గంట సేపు నిర్విరామంగా శ్రమించి సేవాయత్‌లు మూల విరాటులను రథాలపై స్వర్ణాభరణాలతో అలంకరించారు. అమూల్య రత్నాలు పొదిగిన ఆభరణాలతో జగన్నాథుడు జిగేలు మన్నాడు. ఆరుబయట అశేష భక్తజనం మధ్య రథాలపై అమూల్యమైన రత్న, వైడూర్య ఇత్యాది అపురూప నగలు, ఆభరణాలతో దర్శనం ఇచ్చే ఏకైక దైవం శ్రీజగన్నాథుడేనని భక్తజనం మురిసిపోయారు. ఏటా ఆషాఢ శుక్ల ఏకాదశి తిథి నాడు రథాలపై మూల విరాటులకు ఈ అలంకారం చేయడం ఆచారంగా కొనసాగుతోంది. రాజా కపిలేంద్ర దేవ్ హయాంలో 1460 నుంచి స్వామి వారికి స్వర్ణ అలంకరణ ఆరంభమైనట్లు చారిత్రాత్మక కథనం.

వేశ ప్రకారం

భక్తులకు స్వర్ణ శోభిత శ్రీజగన్నాథుని దర్శనం కలిగించేందుకు అనుబంధ కార్యకలాపాలను వేశ ప్రకారం ఆరంభించి ముగించడం విశేషం. అర్చకులు ఉదయం 6 గంటలకు మంగళ హారతి, మైలమ్, తొడొపొ లగ్గి, ఒబొకాష్, సూర్యపూజ, రోష హోమాదులు ముగించి దేవతలకు నూతన వస్త్రధారణ వంటి దైనందిన క్రతువులను నిర్వహించారు. అనంతరం దేవతలకు గోపాల వల్లభ భోగం సమర్పించారు. ఉదయ ధూప నైవేద్యం అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి స్వర్ణాలంకార కార్యకలాపాలు ప్రారంభించారు. ఈ ప్రక్రియ సుమారు గంట సేపు నిరవధికంగా కొనసాగింది. స్వర్ణ శోభితుడైన స్వామివారిని నంది ఘోష్ రథంపై ఏడాదికోసారి మాత్రమే ఈ దర్శనం చేసుకోవచ్చు. ఈ సందర్భంగా సుమారు 15 లక్షల మంది భక్తజనం తరలి వస్తారనే అంచనాతో అనుబంధ యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. రాత్రి 11 గంటల వరకు నిరిఘ్నంగా స్వర్ణ అలంకార దర్శనం కల్పిస్తామని నిర్వాహక యంత్రాంగం ముందే తెలిపింది.

ముందుగానే వచ్చిన ఆభరణాలు

ఈ ఏడాది స్వర్ణ అలంకరణకు అవసరమైన సకల సంపద ముందస్తుగా బయటకు తరలి వచ్చింది. సాధారణంగా కొన్ని గంటల ముందుగా రత్న భాండాగారం నుంచి ఆభరణాలను బయటకు తీస్తారు. ఈసారి రత్న భాండాగారం తనిఖీ, నిర్వహణ కార్యకలాపాలు పురస్కరించుకుని రెండు రోజులు ముందుగా ఆదివారం రత్న భాండాగారం వెలుపలి గది నుంచి బంగారు ఆభరణాలను బయటకు తీసి తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లో పదిలపరిచారు. వీటిని సాయుధ పోలీసులు మరియు ఆలయ అధికారులు సురక్షితంగా భాండాగారం మేకప్ సేవకులు (స్టోర్ ఇన్‌చార్జ్) తీసుకొచ్చి పుష్పాలక మరియు దైతపతి సేవకులకు అందజేశారు. ఈ నగలు, ఆభరణాలతో పలియా పుష్పాలక్, భిత్తరొచ్చొ మహాపాత్రొ, తొలుచ్చొ మహాపాత్రొ, దైతపతిలు, ఖుంటియా మరియు మేకప్ వర్గం సేవకులు రథాలపై దేవతలను అలంకరించారు.

208 కిలోల బంగారు ఆభరాలు

ఈ సందర్భంగా సోదర సోదరి సమేతంగా శ్రీజగన్నాథుడిని అలంకరించడంలో దాదాపు 208 కిలోల (2 క్వింటాళ్ల 8 కిలోలు) బరువున్న బంగారు ఆభరణాలను వినియోగించినట్లు సమాచారం. శ్రీహస్త (బంగారు హస్తం), శ్రీపాయర్ (బంగారు పాదాలు), శ్రీముకుట (బంగారు కిరీటం), జగన్నాథునికి బంగారు నెమలి పింఛం శ్రీమయూర్ చంద్రిక, నుదుట శ్రీచూలపట్టి, శ్రీకుండల్ (కర్ణ ఆభరణం), శ్రీరాహురేఖ (అర్ధ చతురస్రాకార బంగారు ఆభరణం), శ్రీమాల (బంగారు హారాలు), భగవంతుని నుదుట త్రినేత్ర సంకేత ఆభరణం శ్రీచిత్తా, శ్రీచక్రం (బంగారు చక్రం), శ్రీగద (బంగారు గద), శ్రీపద్మం (బంగారు కమలం) మరియు శ్రీ శంఖం (వెండి శంఖం) వంటి బంగారు ఆభరణాలతో రథాలపై మూల విరాటులకు అలంకరించారు.



దేవీ సుభద్ర బంగారు కిరీటం

దిగజారుతున్న శోభ

కపిలేంద్ర దేవ్ కాలంలో దేవతలకు దాదాపు 138 డిజైన్ల బంగారు ఆభరణాలతో అలంకరణ కొనసాగేది. ప్రస్తుతం ఆ సంఖ్య 20 నుంచి 30కి దిగజారినట్లు అనుబంధ వర్గాల విశ్వసనీయ సమాచారం. తరచూ వినియోగిస్తున్న ప్రాచీన బంగారు ఆభరణాల డిజైన్లు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. అప్పుడప్పుడు తారసపడే చిన్న లోపాల సవరణలకు భక్తులు, యాత్రికులు విరాళంగా ఇచ్చిన ముడి బంగారాన్ని ఉపయోగించి మర మ్మతులు చేస్తారు. ప్రతి సంవత్సరం స్వర్ణ అలంకారానికి ముందు బంగారు ఆభరణాల మెరుపుని పరిశీలించి అనుబంధ చర్యలు చేపడతారు.

ఏడాదికోసారి మాత్రమే

రథాలపై బంగారు శోభతో ఏడాదికోసారి మాత్రమే స్వామి దర్శనం లభిస్తుంది. అపరిమిత భక్తులు, యాత్రికులు ఈ దర్శనం పొందే అవకాశం పొందుతారు. ఇతర సందర్భాల్లో స్వర్ణ అలంకరణ శ్రీమందిరం రత్న వేదికపై జరుగుతుంది. నామమాత్రపు సందర్శకులకు మాత్రమే ఈ దర్శనం లభిస్తుంది. ఏటా దసరా, కార్తీక పూర్ణిమ, పౌష్య పూర్ణిమ మరియు డోల పూర్ణిమ వంటి నాలుగు ఇతర సందర్భాల్లో స్వామివారిని బంగారంతో అలంకరిస్తారు.



తాళధ్వజంపై బలభద్ర స్వామి బంగారు ఆభరణాలు



దర్ప దళనంపై దేవీ సుభద్ర



నంది ఘోష్ రథంపై స్వర్ణ భూషిత శ్రీజగన్నాథుడిని దర్శనం చేసుకుంటున్న భక్తజనం

క్లుప్తంగా

మొక్కులు తీరాలని నాలుక సమర్పణ


చికిత్స పొందుతున్న భక్తుడు

భువనేశ్వర్: తన మొక్కులు తీరాలని ఒక భక్తుడు నాలుక కోసుకున్న ఘటన సంచలనం రేపింది. ఈ ఘటన కెంజొహర్ జిల్లాలోని ప్రసిద్ధ అమ్మ వారి దేవస్థానం ఘుటొగాంప్ తరణి మాత ఆలయంలో చోటు చేసుకుంది. భక్తుడిని గంజాం జిల్లాకు చెందిన బిజయ్ ప్రధాన్‌గా గుర్తించారు. బిజయ్ మంగళవారం సాయంత్రం తర ణి మాత మందిరానికి చేరుకున్నాడు. దేవతని పూజించి తన జేబులో నుంచి బ్లేడును తీసి దేవతను ప్రసన్నం చేసుకోవడానికి తన నాలుకను కత్తిరించాడు. అతని నోటి నుంచి రక్తం కారడా న్ని గుర్తించి తక్షణమే స్థానిక ఆస్పత్రిలో చేర్చా రు. ప్రస్తుతం ఘుటొగాంప్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు వైద్య వర్గాల సమాచారం.

పాఠశాలలో కూలగొట్టిన గోడ పునర్నిర్మాణం

ఎల్ఎన్ పేట: మండలంలోని తాయిమాంబపురం (గార్లపాడు) పునరావాస కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో రెండు రోజుల కిందట కూలగొట్టిన గోడను మళ్లీ నిర్మించారు. పునరావాస కాలనీలో ఉన్న పాఠశాలలో రెండు తరగతి గదులను కలిపి ఎమ్మార్సీగా వినియోగించుకునేందుకు ఎంఈఓ-1 సీహెచ్ మణికుమార్ రంగం సిద్ధం చేసి రెండు రోజుల కిందట గోడ కూలగొట్టే పనులు ప్రారంభించారు. గ్రామస్తులు అడ్డుకోవటంతో పాటు బుధవారం పలు పత్రికల్లో వార్తలు రావటంతో స్పందించిన ఎంఈఓ-1 గోడను నిర్మించే పనులు పూర్తి చేశారు.

కోటబొమ్మాళిలో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు బుధవారం పర్యటించారు. తొలుత కొత్తమ్మ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం రైతుబజార్‌ను సందర్శించి అక్కడ వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు సంతమైదానం, ఎన్టీఆర్ పార్కు, ఐసీడీఎస్ కార్యాలయం వద్ద స్థలాలను పరిశీలించారు. అనంతరం కొత్తపేటలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయానికి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. ఇటీవల కేజీబీవీలో 26 మందికి డయేరియా రావడంపై సర్వశిక్షా ఏపీసీ రోణంకి జయప్రకాష్‌ను ప్రశ్నించారు. మెనూ,మరుగుదొడ్లు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది విధుల నిర్వహణపై ఆరా తీశారు.

విద్యుత్ షాక్‌తో దినసరి కూలీ మృతి

టెక్కలి రూరల్: కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన టెక్కలిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎన్టీఆర్ కాలనీకి చెందిన బతకల పోతయ్య (55) అనే వ్యక్తి బుధవారం స్థానిక మండపోలం కాలనీ సమీపంలో ఒక షాపు పైన జరుగుతున్న వెల్డింగ్ పనులకు వెళ్లాడు. పని జరుగుతున్న సమయంలో ఒక ఐరన్ పైపును కింద నుంచి బిల్డింగ్ మేడపైకి తీసుకువెళ్తుండగా బిల్డింగ్ ముందు వైపుగా వెళ్తున్న 11కేవీ విద్యుత్ లైన్ పైప్‌కు తగలడంతో ఆయనకు షాక్ కొట్టి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య జయలక్ష్మి, పిల్లలు సంతోష్, ఇంద్రజ ఉన్నారు. పోతయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు గుండెలు పగిలేలా రోదించారు.

గూడ్స్ రైలు వ్యాగన్‌లో పొగలు


పూండి రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయిన గూడ్స్ రైలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి రైల్వే స్టేషన్‌లో గూడ్స్ రైలు నుంచి పొగలు వ్యాపించాయి. చంబల్‌పూర్ డివిజన్ తాల్చేరు వైపు నుంచి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గు వ్యాగన్లతో వెళ్తున్న గూడ్స్ రైలు సాయంత్రం 6.05 గంటలకు పూండి స్టేషన్‌కు చేరుకోగానే 16వ వ్యాగన్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. దీంతో గూడ్స్ గార్డు జైప్రకాష్ యాదవ్‌కు మరో ట్రైన్ గార్డు పొగలు వస్తున్నట్లు చెప్పడంతో పూండి రైల్వే స్టేషన్‌లో రెండో నంబరు ప్లాట్ ఫాంపై నిలిపి స్టేషన్ మాస్టర్ ఎస్.పాడికి సమాచారం ఇచ్చారు. ఆయన పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పలాస ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అగ్నిమాపక శకటంతో పూండి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఫైర్ ఆఫీసర్ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది జి.మన్మధరావు, బి.ప్రేమ్‌కుమార్, రామినాయుడు, విష్ణు, గోపాల్ ట్రైన్ వ్యాగన్లను పరిశీలించి 16వ వ్యాగన్‌లో పొగలు వస్తున్నట్లు గుర్తించారు. అనంతరం మంటలను అదుపు చేశారు. అదే ట్రాక్‌లో వస్తున్న ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లను లూప్ ట్రాక్‌లో ఆటంకం లేకుండా గమ్యస్థానాలకు పంపారు. పొగలు రావడానికి గల కారణాలు అధికారులు అన్వేషిస్తున్నారు.

దోపిడీ కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు


పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న బైక్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ స్వాతి కుమార్, పక్కన ఐఐసీ సవ్యసాచి మల్ల


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులు

పర్లాకిమిడి: చెలిగడ గ్రామం వద్ద ఒక వెండి వ్యాపారి నుంచి ఐదు కిలోల రెండు వందల గ్రాముల వెండి పట్టీలు, ఇతర వస్తువులు దొంగలించిన కేసులో ఆర్.ఉదయగిరి పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 10వ తేదీన సంతోష్ కుమార్ మహాపాత్రో (బరంపురం) అనే వ్యాపారి చెలిగడ గ్రామానికి వెండి వస్తువులతో వెళ్లాడు. ఆ గ్రామంలో అడుగు పెట్టగానే పల్సర్ బైక్ మీద వచ్చిన ఇద్దరు దుండగులు సంతోష్‌ను కత్తితో భయపెట్టి, అతని వద్ద ఉన్నటువంటి వెండి వస్తువుల బ్యాగును తీసుకెళ్లిపోయారు. దీంతో ఆయన ఆర్.ఉదయగిరి పోలీసుస్టేషన్‌లో అదేరోజు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించడానికి దర్యాప్తు చేపట్టారు. అయితే పరారైన దుండగులు రవి, అజిత్‌లు గంజాం జిల్లా అస్కా ఎన్ఏసీ కుట్టినాడ గ్రామం వద్ద బైక్‌తో పట్టుబడినట్టు ఆర్.ఉదయగిరి పోలీసుస్టేషన్‌లో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ విలేకరుల సమావేశంలో బుధవారం వెల్లడించారు. వ్యాపారి నుంచి అపహరించుకుపోయిన ఐదు కిలోల వెండి నగల విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ నిందితులు గతంలో డూప్లికేట్ గోల్డు ఇటుకల కేసులో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. ఇద్దరు నిందితుల నుంచి నగలు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు కోసం పోలీసులు గాలిస్తున్నట్టు ఆర్.ఉదయగిరి పోలీసు ఐఐసీ సవ్యసాచి మల్ల తెలిపారు.

ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు

పర్లాకిమిడి: స్థానిక బిజూ కల్యాణ మండపంలో ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్ బుధవారం ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రి కార్డియోలజిస్టు డాక్టర్ ఎల్.కె.విజయకుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా 300 మంది ప్రభుత్వ ఉద్యోగులకు వివిధ రోగాలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. హృద్రోగులకు స్కానింగ్ చేసి రాగోలు జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. మధుమేహం, బీపీ రోగులకు ప్రతిరోజూ గంటసేపు వ్యాయామం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్, డీఎస్పీ సునీల్ కుమార్ మహంతి, డిప్యూటీ కలెక్టర్ ప్రాణకృష్ణ పాణిగ్రాహి, కమలాకాంత పండా, సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని మహేంద్ర తనయ వంతెన సమీపంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో ప్రాణాలు కోల్పోయాడు. స్థానిక ఎస్ఐ టి.రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. జాడుపల్లి గ్రామానికి చెందిన అతపాకల శ్రీధర్ అనే వ్యక్తి బుధవారం మెళియాపుట్టి ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యం సేవించి మహేంద్ర తనయ నదీ సమీపంలోని మర్రిచెట్టు వద్దనున్న ఓ సిమ్మెంట్ దిమ్మపై కూర్చున్నాడు. ఆ మత్తులో కాసేపటికే తూలి శ్మశాన వాటిక వైపు పడిపోయాడు. అక్కడ స్నానాలకు ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ పైపునకు తల బలంగా తగలడంతో తీవ్ర రక్తస్రావమై మృతి చెందాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అటుగా వెళ్తున్న వారు చూసి పోలీసులకు సమాచారం అందజేశారు.

ఎస్ఐ రాజేష్ ఘటనా స్థలానికి వెళ్లి చూసేసరికే అతను చనిపోయి ఉన్నాడు. మృతుని భార్య సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు వ్యవసాయం చేసుకుంటూ.. నిత్యం మద్యం తాగుతూ తిరిగేవాడని దాని వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గంజాయి కేసులో మరో వ్యక్తి అరెస్టు


అరెస్టైన బాబులి మెహర

జయపురం: జూన్ 22వ తేదీన అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ జయపురం సదర్ పోలీసులకు పట్టుబడిన 31 కేజీల గంజాయి కేసులో మరో నిందితుడిని అరెస్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్రతండి బుధవారం వెల్లడించారు. ఈ కేసులో ఇదివరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన విషయాన్ని పోలీసు అధికారి గుర్తు చేశారు. ఇప్పుడు అరెస్టైన వ్యక్తి జునాగడ్ పోలీసుస్టేషన్ పరిధి బందిబాసులి గ్రామానికి చెందిన బాబులి మెహర్ ఉరఫ్ టికుగా పేర్కొన్నారు. అతని వద్దనుంచి గంజాయితో పాటు ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గతంలో అరెస్టైన నిందితులను తమదైన శైలిలో విచారించగా మాచ్ ఖండ్ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి, జునాగడ్ పోలీసుస్టేషన్ పరిధి బందిబాసులి గ్రామం బాబులి మెహర్ ఉరఫ్ టికుకు అందజేసేందుకు తీసుకెళ్లేందుకు వెళ్తున్న విషయాన్ని వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం తాము జునాగఢ్ పోలీసుల సహకారంతో బాబులి మెహరను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

చీడివలసలో కేసుల దర్యాప్తుపై డీఎస్పీ ఆరా

బూర్జ: చీడివలస గ్రామంలో శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి బుధవారం పర్యటించారు. పలు చోరీల కేసుల్లో నిందితులను గుర్తించడంలో పోలీసులు తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలపై ఆమె ఆరా తీశారు. గ్రామంలో ఇటీవల సోలార్ ప్యానల్, బంగారు ఆభరణాలు దొంగిలించిన సంగతి తెలిసిందే. అయితే ఈ కేసుల విషయంలో పూర్తిస్థాయిలో దర్యాప్తు జరగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కొల్లివలస వచ్చిన పోలీసులతోనూ ఇలాగే వాగ్వాదం పెట్టుకున్నారు. దీంతో డీఎస్పీ గ్రామానికి వెళ్లి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ జీవీ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు


కొరాపుట్: సునావేశంలో జగన్నాథుడు

- స్వర్ణాలంకరణలో దర్శనమిచ్చిన జగన్నాథుడు

తొలి ఏకాదశి పురస్కరించుకొని పిన్నమ్మ ఇంటి వద్ద విడిది చేసిన శ్రీజగన్నాథ, బలభద్ర, సుభద్రలు సునావేషంలో భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. వర్షం పడుతున్నా స్వర్ణాలంకరణలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బాలురుతీరారు. పలుచోట్ల మహిళలు ఉపవాసాలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు.

– సాక్షి నెట్‌వర్క్


పర్లాకిమిడి: బలభద్ర రథం వద్ద భక్తుల సందడి


పర్లాకిమిడి: బంగారు ఆభరణాల అలంకరణలో సుభద్ర


పర్లాకిమిడి: పూజలందుకుంటున్న శ్రీజగన్నాథుడు


కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో దేవదేవుళ్లకి బంగారు ఆభరణాల అలంకరణ


రాయగడ: పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాంజీ ఆచార్యులు


పర్లాకిమిడి: రథాల వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు


రాయగడ: సామూహిక వ్రతాల్లో కూర్చున్న భక్తులు

రాయగడలో చోరీ


తెరిచి ఉన్న బీరువా

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కేంద్రంలో చోరీ జరిగింది. బుధవారం దీపేష్ బరయ్ అనే వ్యక్తి ఇంట్లో దొంగలు పడ్డారు. ముందు రోజు బాధితుడు కుటుంబ సమేతంగా రౌర్కెలా వెళ్లాడు. ఉదయం తిరిగి ఇంటికి వచ్చేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు మాయమయ్యాయని బాధిత కుటుంబం పేర్కొంది. దొంగలు తలుపులు విరగ్గొట్టి బీరువాలో ఆభరణాలు పట్టుకుపోయారు. దీపేష్ బరయ్ భార్య గీతా బరయ్ రాయిఘర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

కమల పూజారికి అస్వస్థత


కమల పూజారిని పరీక్షిస్తున్న వైద్యులు

జయపురం: పద్మశ్రీ కమల పూజారి అనారోగ్యంతో జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో బుధవారం చేరారు. ఒక వైద్య బృందం ఆమెకు చికిత్స అందజేస్తోంది. ఆమెకు అస్వస్థతగా ఉందని ఉదయం సమాచారం అందిన వెంటనే ఆస్పత్రి వర్గాలు అంబులెన్స్‌లో ఒక డాక్టర్, ఒక ఫార్మాసిస్టుతో పాటు కొంతమంది సిబ్బందిని ఆమె గ్రామానికి పంపించారు. అక్కడ ఆమెకు ప్రాథమిక చికిత్స చేసిన తర్వాత ఆరోగ్యం కుదుటపడడంతో వైద్య బృందం గ్రామం నుంచి వెనుదిరిగింది. అయితే మధ్యాహ్నానికి మరలా ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. దీంతో ఆమెకు ఒక ప్రత్యేక కేబిన్‌లో చికిత్స ప్రారంభించారు. ఆస్పత్రి అధికారి డాక్టర్ రబీంద్రనాథ్ మిశ్ర, డాక్టర్ సునీల భొత్ర, డాక్టర్ రబిచంద్ర ఖెముండులు చికిత్స చేస్తున్నారు.

బాల కార్మికుడి అప్పగింత


అధికారుల వద్దనున్న బాల కార్మికుడు

పర్లాకిమిడి: స్థానిక గుండిచా మందిరం వద్ద రథయాత్రలో నీటిలో తిరిగే రంగుల రాట్నంలో పని చేస్తున్న బాల కార్మికుడిని జిల్లా బాల కార్మిక హెల్ప్ లైన్ అధికారులు పట్టుకొని, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారికి అప్పగించారు. ఖుర్దా పట్టణానికి చెందిన ఈ 12 ఏళ్ల కుర్రాడిని రంగుల రాట్నంలో పనికి వినియోగిస్తున్నారని విలేకరులు కొందరు ఫిర్యాదు చేయగా హెల్ప్‌లైన్ అధికారులు రథయాత్రకు వెళ్లి తీసుకొచ్చారు. అయితే బాలుడి తండ్రి చనిపోవడంతో పనికి కుదిరినట్లు పనిలో పెట్టుకున్న వ్యాపారి తెలియజేశారు. బాల కార్మికుడిని హెల్ప్‌లైన్ కో-ఆర్డినేటర్ వైశాలి పట్నాయిక్, కర్మచారి సంగీత, రబి రవుత్‌లు స్వగ్రామం తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్యదర్శులతో చీఫ్ సెక్రటరీ సమావేశం


సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: స్థానిక లోక్‌సేవా భవన్‌లో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా అధ్యక్షతన కార్యదర్శుల సమావేశం బుధవారం జరిగింది. త్వరలో శాసనసభలో ప్రవేశపెట్టనున్న సాధారణ బడ్జెట్ రూపురేఖలపై ఈ సమావేశంలో చర్చించారు. దీనితో పాటు ఈనెల 27న న్యూఢిల్లీలో జరగనున్న నీతి అయోగ్ 9వ సాధారణ మండలి సమావేశం మరియు 2024 నవంబర్‌లో జరగనున్న 4వ జాతీయ ప్రధాన కార్యదర్శుల సదస్సులో రాష్ట్ర అజెండాపై చర్చించారు. క్షుద్బాధ రహిత సమాజం , మంచి ఆరోగ్యం, ఉన్నతమైన విద్య, స్త్రీ, పురుష సమానత్వం, సురక్షిత తాగునీరు, సమన్వయ వ్యవసాయం, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలపై సమావేశంలో లోతుగా చర్చించారు. 5 సంవత్సరాల ప్రణాళికలు, కార్యక్రమాల రూపకల్పన, అమలు, 2036లో స్వతంత్ర ఒడిశా శత వార్షికోత్సవాలు, 2047లో భారత స్వాతంత్ర్యం శత వార్షికోత్సవాలు మరియు అభివృద్ధిపై లక్ష్య సాధన, దానిపై భాగస్వాములు మరియు నిపుణులతో చర్చలు జరపడంపై ప్రముఖ కార్యదర్శి మనోజ్ అహుజా ఉద్ఘాటించారు.

సరికొత్త ఎత్తుగడ

- మాజీ సీఎం నవీన్ అనూహ్య నిర్ణయం
- తన ఎమ్మెల్యేలతో షాడో క్యాబినెట్ ఏర్పాటు
- శాఖల వారీగా సమస్యలపై స్పందించేందుకు బాధ్యతలు కేటాయింపు

భువనేశ్వర్: రానున్న అసెంబ్లీ సమావేశాల్లో క్రియాశీలకమైన, బలమైన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలు లేవనెత్తుదామని విపక్ష నేత, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రభుత్వంలోని వివిధ శాఖల కార్యక్రమాలను పర్యవేక్షించి, సమస్యలపై స్పందించే బాధ్యతలను ఆ పార్టీ ఎమ్మెల్యేలకు బుధవారం కేటాయించారు. దీని కోసం షాడో క్యాబినెట్ ఏర్పాటు చేశారు. ఇది రాష్ట్రంలో తొలి షాడో క్యాబినెట్‌గా భావిస్తున్నారు. దీనిలో ఆ పార్టీకి చెందిన 50 మంది సభ్యులకు శాఖలవారీగా బాధ్యతలు అప్పగించారు. వారు మంత్రుల కార్యకలాపాలను నిశితంగా గమనించి, రాష్ట్ర శాసనసభలో శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావిస్తారు. అసెంబ్లీలో బీజేపీ ప్రభుత్వాన్ని ధీటుగా నిలదీయడమే లక్ష్యంగా ఈ ఎత్తుగడ వేసినట్లు స్పష్టమవుతోంది.

- శాసనసభలో ప్రజాగళం

ప్రభుత్వ పాలనలో ప్రతీ శాఖకు సంబంధించిన కార్యాచరణ నైపుణ్యం పెంపొందించడానికి బిజూ జనతా దళ్ 50 మంది ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ బాధ్యతలతో విపక్ష సభ్యులు ప్రజా ప్రాతినిధ్యంలో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటారు. ఒక్కో సభ్యుడు నిర్దిష్ట పాలన వ్యవహారాలపై శాసన సభలో ప్రజాగళం వినిపిస్తారు. త్వరలో జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో, ఆ తర్వాత ఏ బీజేడీ ఎమ్మెల్యే ఏ అంశంపై మాట్లాడాలో ముందే నిర్ణయించబడింది. ఉదాహరణకు మాజీ మంత్రి ప్రసన్న ఆచార్యకు ఆర్థిక శాఖ బాధ్యతలు అప్పగించారు. ఆయన సభ లోపల, బయట బీజేపీ ప్రభుత్వ మొదటి బడ్జెట్‌పై స్పందిస్తారు. అదేవిధంగా మాజీ మంత్రి ప్రతాప్ కేశరీ దేవ్ ముఖ్యమంత్రి మోహన్ మాఝీ చూసుకునే రెండు ముఖ్యమైన విభాగాలు సాధారణ పరిపాలన, ప్రజాభియోగాలు పర్యవేక్షిస్తారు. ముఖ్యమంత్రి అధీనంలో హోం శాఖ కార్యకలాపాలతో పాటు ఆహారం, సరఫరా, వినియోగదారుల సంక్షేమం వ్యవహారాలను మాజీ మంత్రి నిరంజన్ పూజారి పర్యవేక్షిస్తారు. మాజీ మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వయినురెవెన్యూ మరియు విపత్తు నిర్వహణపై స్పందించేందుకు కేటాయించారు.

అర్ధరాత్రి ద్విచక్రవాహనం దగ్ధం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ద్విచక్రవాహనాన్ని పెట్రోల్ పోసి కాల్చేసినట్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రత్తకన్న దేవాంగ వీధికి చెందిన సిరిపురపు కుమార్ తన ప్యాషన్ ప్రో ద్విచక్రవాహనాన్ని ఇంటి వద్ద రాత్రి ఉంచారు.

అయితే అర్ధరాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి కాల్చివేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ గోపాలకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

67 సచివాలయాల్లో ఆధార్ సేవలు


జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి రామచంద్రరావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలోని 67 సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులోకి వస్తున్నట్లు జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ అప్‌డేట్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారి దగ్గరలో ఆధార్ సేవలున్న సచివాలయంలో సేవలను వినియోగించుకోవచ్చునని సూచించారు.

నానో కారు నుంచి పొగమంటలు


నానో కారు నుంచి చెలరేగుతున్న మంటలు

పార్వతీపురంటౌన్: పట్టణంలో నానో కారు నుంచి బుధవారం పొగమంటలు వచ్చాయి. ఈ మేరకు ఫైర్ అధికారి పి.పైడిరాజు తెలిపిన వివరాల ప్రకారం సంకా వీధికి చెందిన శ్రీనివాసరావు నానో కారులో బ్యాటరీ కాలిపోవడం వల్ల షార్ట్ సర్క్యూట్ అయి పొగమంట రావడంతో స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.20 వేల నష్టం జరిగి ఉంటుందని ఫైర్ అధికారులు అంచనా వేశారు.

క్రీడాకారిణికి రాకెట్ వితరణ


మౌనికకు ర్యాకెట్ ఇస్తున్న తాతాజీ తదితరులు

శృంగవరపుకోట: స్థానిక ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న పి.మౌనికకు ధర్మవరం గ్రామస్తుడు కాపుగంటి తాతాజీ రూ.5000 విలువైన రాకెట్‌ను బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా చీఫ్‌కోచ్ పి.శ్రీరాములు మాట్లాడుతూ నైపుణ్యం ఉన్న క్రీడాకారులను దాతలు ప్రోత్సహించడం వల్ల ఎస్.కోటలో షటిల్‌బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధి చెందుతోందన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన


జాబ్ ఆర్డర్లతో అభ్యర్థులు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని భాస్కర్ డిగ్రీ కళాశాలలో వర్క్‌రూట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు జిల్లాలోని 400మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరు కాగా వారిలో 110మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వర్క్ రూట్ కన్వీనర్ గంగాధర్, కళాశాల ప్రిన్సిపాల్, ఎం.రవిశాస్త్రి, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బ్యాటరీ ఆటో ప్రారంభం

- 4 గంటలు బ్యాటరీ చార్జిచేస్తే 120 కి.మీ. ప్రయాణం
- సెంచూరియన్ వర్సిటీ వైస్ ప్రెసిడెంట్, ప్రొఫెసర్ డి.ఎన్.రావు


బ్యాటరీ ఆటోను ప్రారంభిస్తొన్న వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు, ఆయన సతీమణి పద్మ, తదితరులు

నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ విశ్వవిద్యాలయం రూపొందించిన ఎలక్ట్రిక్ బ్యాటరీ ఆటోను వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు, ఆయన సతీమణి పద్మ బుధవారం ప్రారంభించారు. లిథియమ్ ఐయాన్ బ్యాటరీతో నడిచే ఆటోలో డ్రైవర్‌తో కలిపి ఐదుగురు ప్రయాణించవచ్చని జీటీఈటీ సీఈఓ బాబుశంకర్ తెలిపారు. నాలుగు గంటల పాటు బ్యాటరీ చార్జి చేస్తే 120 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చన్నారు. గతంలో బ్యాటరీతో నడిచే ఆటోల తయారీకి స్టీల్ ఉపయోగించగా, వీటిని ఫైబర్‌తో తయారు చేసినట్టు వెల్లడించారు. ఆటో చూపరులను ఆకర్షించడంతో పాటు ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ఐక్యూఏసీ డీన్ పీఎస్వీ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, సుమన్, కిశోర్ మహాపాత్రో, తదితరులు పాల్గొన్నారు.

వెళ్లొస్తా..మరి!

- బదిలీ ఎస్పీ ఎం.దీపిక
- మూడేళ్ల పాటు జిల్లాలో సేవలు
- జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం


ఎస్పీ ఎం.దీపిక దంపతులను సత్కరిస్తున్న జిల్లా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు

విజయనగరం క్రైమ్: చక్కని ప్రణాళికకు సమర్థవంతమైన తోడ్పాటుతోనే విజయం సాధ్యమవుతుందని అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లిన ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి స్థానిక ఎస్.కన్వెన్షన్‌లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆమెకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను పనిచేసిన పదేళ్లకాలంలో నాలుగేళ్లు విజయనగరం జిల్లాలోనే ఏఎస్పీగా, ఎస్పీగా పనిచేయడంతో తనకు జిల్లా ప్రజలతో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందన్నారు. జిల్లా ప్రజలు చాలా సౌమ్యులని, వారి సమస్యలను పరిష్కరించేందుకు సకాలంలో స్పందిస్తే కుటుంబసభ్యుల్లా ఆదరిస్తారని సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్‌శాఖలో అన్ని విభాగాలు సమర్థవంతంగా పనిచేయడంతో ఎన్నో క్రియాశీలకమైన కేసులను ఛేదించగలిగామన్నారు. ఈ సందర్భంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీలు ఎం.దీపిక, విక్రాంత్ పాటిల్ దంపతులను పోలీస్ అధికారులు, సిబ్బంది, వేదపండితుల మంత్రోచ్చారణలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, డీఎస్పీలు ఆర్.గోవిందరావు, డి.విశ్వనాథ్, పి.శ్రీనివాసరావు, ఏఎస్.చక్రవర్తి, యూనివర్స్, పీపీ.జయలక్ష్మి, సీఐలు కేకేవీ.విజయనాథ్, బి.వెంకటరావు, జె.మురళి, రాజశేఖరరావు, ఉపేంద్రరావు, ఎస్సైలు యు.మహేష్, శ్యామల, తదితరులు ఎస్పీ సేవలను ప్రశంసించారు. అనంతరం ఎస్పీ దీపికను జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో దుశ్శాలువతో ఘనంగా సత్కరించి , పుష్పమాలాంకృతులను చేసి, జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు, సన్మానపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, జర్నలిస్టులు పాల్గొని ఎస్పీ దంపతులకు అభినందనలు తెలిపారు.

ప్రకృతి కరుణ..దేవుడి దయతో..!


తలారి గ్రామం సమీపంలో ఉబాలు వేస్తున్న మహిళలు

- పుట్టెడు ఆశతో ముందుకు సాగుతున్న అన్నదాతలు
- ముమ్మరంగా జరుగుతున్న వరి ఉబాలు


కొట్యాడ గ్రామ పొలాల్లో వరి నారు తీస్తున్న మహిళలు


ఎల్.కోట గ్రామం పొలాల్లో ట్రాక్టర్‌తో దమ్ముపడుతున్న రైతు

లక్కవరపుకోట: ప్రస్తుతం కురుస్తున్న కొద్ది పాటి వర్షాలకు రైతులు ఖరీఫ్ వరి పంట ఉబాలు ప్రారంభించారు. ఈ మేరకు లక్కవరపుకోట మండలంలోని లక్కవరపుకోట, ఖాసాపేట, తలారి, వీరభద్రపేట, కొట్యాడ, గొల్జాం తదితర గ్రామాల్లో ఉబాలు ముమ్మరంగా సాగుతున్నాయి. గతంలో ఖరీఫ్‌లో వరి పంట సాగుకు ప్రభుత్వం సహాయంగా రూ.7,500 రైతు భరోసా రూపంలో అన్నదాతలకు అందజేసేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అటువంటి సహాయం లేకపోయినా అప్పులు చేసి ఖరీఫ్ పంట సాగుకు రైతులు సిద్ధమయారు. వాస్తవానికి గత ఏడాది ఇదే సమయానికి మండలంలో సుమారుగా 50శాతానికి పైగా ఉబాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఇప్పుడిప్పుడే రైతులు ఉబాలు ప్రారంభించారు. పాలకుల దయ లేకపోయినా భగవంతుడిపై భారం వేసి ప్రకృతి సహకారంతో పంటలు సాగుచేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

మూడేళ్ల చిన్నారిపై కుక్కల దాడి

- గాయాలపాలైన బాలిక
- బెంబేలెత్తుతున్న పాచిపెంట గ్రామస్తులు

పాచిపెంట: మండల కేంద్రంలో గ్రామ సింహాలు(కుక్కలు) స్వైర విహారం చేస్తున్నాయి. స్థానిక దాసరవీధికి చెందిన మూడేళ్ల చిన్నారి హంసినిని కుక్కలు బుధవారం గాయపరిచాయి.వెంటనే గుర్తించిన స్థానికులు చిన్నారిని స్థానిక పీహెచ్‌సీకి, అక్కడి నుంచి సాలూరు ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. వీధుల్లో పదికి పైగా కుక్కలు గుంపుగా స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడదను తప్పించాలని కోరుతున్నారు.

తప్పుడు కథనాలపై చర్యలు తీసుకోవాలి

- అంబేడ్కర్ రైట్స్ ఫోరం డిమాండ్


రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న భానుమూర్తి, తదితరులు

విజయనగరం రూరల్: దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, గిరిజన సామాజిక వర్గానికి చెందిన మహిళ శాంతికుమారిపై ఉద్దేశపూర్వకంగా, వివక్షతో తప్పుడు కథనాలు ప్రసారం చేస్తున్న చానళ్లు, వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని అనుసరించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ రైట్స్ ఫోర సభ్యులు డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతికుమారిపై 5 రోజులుగా కొంత మంది వ్యక్తులు, సంస్థలు తప్పుడు కథనాలు ప్రసారం చేయడమే కాకుండా, వాటిని బహిర్గతం చేస్తున్నారన్నారు. దీంతో పాటు అబద్ధపు సాక్ష్యాలు సృష్టించి, వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అంతే కాకుండా గిరిజన సామాజికవర్గానికి చెందిన శాంతికుమారిపై లైంగిక సంబంధిత తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావుకు వినతిపత్రాన్ని ఆయన కార్యాలయంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ రైట్స్ ఫోరం అధ్యక్షుడు బొంగు భానుమూర్తి, చిన్నం అరుణ్‌కుమారి, పూసర్ల మధుసూదనరావు, జె.రాజ్‌కుమార్, వంశీ, గౌరీష్ పాల్గొన్నారు.

జర్నలిస్టు హెల్త్‌స్కీమ్ పొడిగింపు

పార్వతీపురం: వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్‌స్కీమ్ పథకాన్ని 2024–25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని విధంగా అనారోగ్యం సంభవిస్తే ప్రతిసారీ రూ.2లక్షల వరకు వైద్యసేవలు అందుతాయని పేర్కొన్నారు. ఇలా సంవత్సరం కాలంలో ఎన్నిసార్లు అయినా పరిమితి లేకుండా సదుపాయాన్ని అందిస్తారన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ తరహాలో వైద్యసేవలు పొందవచ్చన్నారు. అక్రిడేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని పొందవచ్చన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎఫ్ఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రూ.1,250లు ఈనెల 31లోగా చెల్లించాలన్నారు. డిసెంబర్ 31, 2025 వరకు ఈ స్కీం ద్వారా జర్నలిస్ట్‌లు లబ్ధిపొందవచ్చునని తెలిపారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజనల్ చలానా, అక్రిడిటేషన్ జిరాక్స్, హెల్త్ స్కీమ్ దరఖాస్తు, కుటుంబసభ్యుల ఫొటోలు, ఆధార్ కార్డుల కాపీలను డీపీఆర్ఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

హత్య కేసు నిందితుడి లొంగుబాటు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

బలిజిపేట: మండలంలోని గంగాడ గ్రామానికి చెందిన సావిత్రి హత్య కేసులో హతురాలి మరిది జి.హరిబాబు తనంతట తానే స్వయంగా లొంగిపోయినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు బలిజిపేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన సావిత్రమ్మ కనిపించడం లేదని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహించగా గ్రామ సమీపంలో ఉన్న రామన్నబందలో ఆమె మృతదేహం కనిపించిందని, పోస్టుమార్టం కోసం పంపించగా హత్యకు గురైనట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. దీనిపై కేసు నమోదుచేశామని తెలిపారు. అయితే ఇంతలో మృతురాలి మరిది హరిబాబు తానే హత్యచేసినట్టు ఒప్పుకుని గ్రామ వీఆర్వో వద్ద లొంగిపోయాడని చెప్పారు. నిందితుడిని మళ్లీ విచారణ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. హత్యకు వారి మధ్య తలెత్తిన భూతగాదాలే కారణమని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

తూకాల్లో తేడా లేకుండా చూడాలి

- సివిల్ సప్లయిస్ డీఎం మీనా


ఆర్అండ్‌బీ రైతుబజార్‌లో కందిపప్పును పరిశీలిస్తున్న డీఎం మీనా


విజయనగరం ఫోర్ట్: సరుకులు విక్రయించేటప్పుడు తూకాల్లో తేడా లేకుండా చూడాలని సివిల్ సప్లయిస్ డీఎం మీనా హితవు పలికారు. ఈ మేరకు విజయనగరంలోని ఆర్అండ్‌బీ, రింగ్‌రోడ్డు, ఎంఆర్ పాత ఆస్పత్రి వద్ద గల రైతు బజార్‌లను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు బజార్లలో కందిపప్పు, బియ్యం విక్రయాలను ఈ సందర్భంగా పరిశీలించారు. అదేవిధంగా ఇంతవరకు విక్రయించిన కందిపప్పు, బియ్యం వివరాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కందిపప్పు, బియ్యం అడిగిన వారందరికీ ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారులు చప్ప సతీష్, అప్పలనాయుడు, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ బాధ్యత అందరిదీ


వర్క్‌షాప్‌లో పాల్గొన్న రీజనల్ బయోడైవర్సిటీ కోఆర్డినేటర్ జానకిరామ్ తదితరులు

గరుగుబిల్లి: ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రీజనల్ బయోడైవర్సిటీ కోఆర్డినేటర్ జానకి రామ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన గరుగుబిల్లి మండలంలోని తోటపల్లిలో గల జట్టు ఆశ్రమ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన వర్క్‌షాపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడి నుంచి పొలం బడికి కార్యక్రమంలో భాగంగా రచయితలు రచించిన పాఠ్యాంశాలను విద్యార్థులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులకు ప్రకృతి ఆవశ్యకతను వివరిస్తే వారు తల్లిదండ్రులకు వివరించే అవకాశం ఉంటుందని అభిప్రాయ పడ్డారు. తద్వారా ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్య కరమైన, నాణ్యమైన ఉత్పత్తులను అందించాలంటే ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించాలని కోరారు. ఈ సందర్భంగా జానకీ రామ్‌ను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత భీమేశ్వరరావు, జట్టు ట్రస్టీ పారినాయుడు తదితరులు దుశ్శాలువతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో సిలబస్ కన్సల్టెంట్లు టి. శివాజీ, ఆర్.వాసుదేవరావు, టి. శివకేశవరావు, ఎల్.వెంకటస్వామి, పి.రవీంద్రనాథ్, బీవీ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



మృతుని ఆధార్ కార్డ్


ట్రాక్‌పై మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఎస్సై రవివర్మ

విజయనగరం క్రైమ్: ఒడిశా రాష్ట్రంలోని గుణుపూర్‌కు చెందిన ప్రతాప్ చంద్రో పాత్రో (62) ప్రమాదవశాత్తు దుర్గ్ ప్యాసింజర్ రైలు కింద పడి బుధవారం మృతిచెందారు. ఒడిశాలో కానిస్టేబుల్‌గా పనిచేసి పదవీవిరమణ చేసిన ఆయన బెంగళూరు వెళ్లేందుకు భార్యతో సహా ఒడిశా నుంచి దుర్గ్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్నం బయల్దేరారు. రాయగడ నుంచి విశాఖపట్నం వెళ్లే రైలు విజయనగరంలో ఉదయం 9.07గంటలకు ఆగింది. ముందుగా ఆయన భార్య గీతాంజలి రైలు దిగారు. ప్రయాణికులంతా దిగుతుండగానే ప్రతాప్ లగేజీని దింపుతున్న సమయంలో 9.12 గంటలకు రైలు కదిలింది. ఈ లోగా ఆయన తొందరగా దిగేందుకు ప్రయత్నించే క్రమంలో లగేజీతో పాటు రైలు, ప్లాట్‌ఫామ్ మధ్యలో పడిపోయారు. అంతలో రైలు కదిలిపోవడంతో రెండు కాళ్లు తెగిపోయాయి. తీవ్రరక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కళ్లముందే భర్త మృతిచెందడంతో గీతాంజలి కన్నీటిపర్యంతమైంది. స్థానికులు ఆమెను ఓదార్చారు. రైల్వే అధికారుల ఫిర్యాదు మేరకు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ సంఘటనా స్థలానికి వచ్చి విచారణ చేశారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవివర్మ తెలిపారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

- పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ పిలుపు


సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ పి.కామేశ్వరరావు

పార్వతీపురంటౌన్: సీపీఐ బలోపేతానికి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ పి.కామేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలోని బెలగాం చర్చి సెంటర్ సమీపంలో ఉన్న గిరిజన సామాజిక భవనంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బుడితి అప్పలనాయుడు అధ్యక్షతన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన సీపీఐ జిల్లా సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఈ సమావేశాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులంతా విజయవంతం చేయాలని కోరారు. అలాగే సీపీఐ బలోపేతానికి సమితి సభ్యులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, సహాయ కార్యదర్శి టి జీవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు సాలాపు అనంతరావు, సింహాద్రి దుర్గారావు, పువ్వల ప్రసాద్, దుర్గారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరమొస్తే..పడిపోతున్న ప్లేట్‌లెట్స్..!

- డెంగీ, వైరల్ జ్వరపీడితుల్లో తగ్గుతున్న పరిస్థితి
- ప్రభుత్వ, ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్‌లను ఆశ్రయిస్తున్న రోగుల బంధువులు


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు


ప్లేట్ లెట్స్

విజయనగరం ఫోర్ట్: రవి అనే వ్యక్తి జ్వరంతో బాధపడుతూ కొద్ది రోజుల క్రితం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. ఈ నేపథ్యంలో పరీక్షించిన వైద్యులు ప్లేట్‌లెట్స్ తగ్గడంతో ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్ నుంచి మూడు ప్యాకెట్ల ప్లేట్ లెట్స్ తెప్పించి ఎక్కించారు.

- అలాగే రాజేష్ అనే వ్యక్తి జ్వరంతో బాధపడుతూ కొద్ది రోజుల క్రితం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. అతనికి వైద్య పరీక్షలు నిర్వహించగా ప్లేట్‌లెట్స్ తగ్గాయి. దీంతో వైద్యులు బ్లడ్‌బ్యాంక్ నుంచి నాలుగు ప్యాకెట్ల ప్లేట్‌లెట్స్ తెప్పించి ఎక్కించారు.

జిల్లాలో అధికంగా జ్వరాల వ్యాప్తి

వైరల్ జ్వరాలతో పాటు మలేరియా, డెంగీ జ్వరాల వ్యాప్తి జిల్లాలో అధికంగా ఉంది. డెంగీ జ్వరాలతో పాటు, వైరల్ జ్వరం బారిన పడినవారికి కూడా ప్లేట్‌లెట్స్ తగ్గుతున్నాయి. సాధారణంగా డెంగీ బారిన పడినవారికి ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి. అయితే ఇప్పుడు సాధారణ జ్వరాలకు కూడా ప్లేట్‌లెట్స్ తగ్గడం గమనార్హం.

కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

జ్వరపీడితులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు కూడా జ్వర పీడితులు వస్తున్నారు. బాధితుల్లో కొంతమంది ఓపీ విభాగంలో చికిత్స చేయించుకుని వెళ్లిపోతుండగా, మరి కొంతమంది ఇన్‌పేషెంట్లుగా ఆస్పత్రుల్లో చేరుతున్నారు.

నెలకు 200 మందికి ప్లేట్‌లెట్స్ వినియోగం

జ్వరాల వ్యాప్తి ప్రస్తుతం ఎక్కువగా ఉండడంతో ప్లేట్‌లెట్స్ వినియోగం కూడా ఎక్కువగానే ఉంది. నెలకు 150మంది నుంచి 200 మందికి ప్లేట్‌లెట్స్ వినియోగిస్తున్నారు. అవి తగ్గిపోయిన రోగుల కోసం బంధువులు బ్లడ్‌బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. ప్లేట్‌లెట్స్ సకాలంలో ఎక్కించకపోతే ప్రాణాల మీదికి వస్తుందని వైద్యులు చెప్పిన వెంటనే రోగి బంధువులు ప్లేట్‌లెట్స్ తెచ్చి వైద్యసిబ్బందితో రోగులకు ఎక్కిస్తున్నారు.

81 డెంగీ కేసులు నమోదు:

జిల్లాలో ఇంతవరకు డెంగీ కేసులు 81 నమోదయ్యాయి. అలాగే వైరల్ జ్వరాలు 1.80 లక్షల మంది వరకు నమోద య్యాయి. మైదాన ప్రాంతంతో పాటు గిరిజన ప్రాంతాల్లోను అధికంగానే జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. జ్వరాల బారిన పడిన వారు కొంతమంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందగా, మరికొంతమంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డెంగీ జ్వరం బారిన పడిన వారితో పాటు వైరల్ జ్వరం వచ్చిన వారికి కూడా ప్లేట్‌లెట్స్ తగ్గడంతో వారికి ఎక్కించాల్సిన పరిస్థితి.

అవసరమైన వారికి అందజేత

డెంగీ జ్వరంతో పాటు వైరల్ జ్వరం వచ్చిన వారికి ప్లేట్ లెట్స్ తగ్గుతుంటాయి. దీంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు ప్లేట్ లెట్స్ కోసం వచ్చిన వారికి అందిస్తున్నాం.

డాక్టర్ పి.స్వాతి, పెథాలజిస్టు, బ్లడ్ బ్యాంక్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

ఐసీడీఎస్‌లో ఉద్యోగాలకు లంచం డిమాండ్

- అధికారుల పేరుచెప్పి డబ్బులు ఇవ్వాలని దరఖాస్తుదారులకు ఫోన్ చేస్తున్న ఆగంతకుడు
- ఒక్కోపోస్టుకు రూ.50వేల నుంచి రూ. 2లక్షలు ఇవ్వాలని డిమాండ్
- డబ్బులు ఇవ్వకపోతే పోస్టు వేరేవారికి ఇచ్చేస్తామంటూ బెదిరింపు

విజయనగరం ఫోర్ట్: ‘ హలో నేనండీ కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ డిపార్టమెంట్‌లో పనిచేస్తున్నాను. మీరు ఐసీడీఎస్‌లోని సోషల్ వర్కర్ పోస్టుకు దరఖాస్తు చేశారు కదా. మీకు పోస్టు కావాలంటే రూ.లక్ష అవుతుంది. ముందుగా రూ.50వేలు నేను చెప్పిన చోటకు తేవాలి. కలెక్టర్ నుంచి అందరు అధికారులకు ఇచ్చుకోవాలి కదా. లేకపోతే మీ పోస్టు వేరొకరికి ఇచ్చేస్తామంటూ సోషల్ వర్కర్ పోస్టుకు దరఖాస్తు చేసిన ఓ అభ్యర్థికి రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశారు’.

- అకౌంటెంట్ పోస్టుకు దరఖాస్తు చేసిన మరో అభ్యర్థికి కూడా రూ.50 వేలు డిమాండ్ చేశాడు. ముందుగా రూ.25 వేలు ఫోన్‌పే చేయాలని సూచించాడు. డబ్బులు ఇవ్వకపోతే ఆ పోస్టును వేరే వ్యక్తికి ఇచ్చేస్తామంటూ రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఆ అభ్యర్థికి స్పష్టంచేశాడు.
- ఈ ఇద్దరే కాదు సుమారు 20 మందికి ఆ వ్యక్తి ఫోన్‌చేసి డబ్బులు డిమాండ్ చేయడం ప్రస్తుతం అధికార వర్గాల్లో కలకలం రేపుతోంది. ఒక్కో పోస్టుకు ఒక్కో విధంగా డబ్బులు డిమాండ్ చేసినట్టు ఫోన్ రికార్డులు ఆధారంగా తెలుస్తోంది. కొన్ని పోస్టులకు రూ.50 వేలు నుంచి రూ. లక్ష వరకు, కొన్ని పోస్టులకు రూ.లక్ష నుంచి రూ. 2లక్షల వరకు డిమాండ్ చేశాడు.

23 పోస్టులకు 384 దరఖాస్తులు

ఐసీడీఎస్ పరిధిలోని జిల్లా బాలల సంరక్షణ విభాగం (డీసీపీయూ)లో 23 పోస్టులకు గాను 384 మంది దరఖాస్తుచేశారు. దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి మెరిట్ జాబితాను అధికారులు సిద్ధం చేశారు. డీసీపీయూ పోస్టుకు 80 దరఖాస్తులు, డీఈఓ పోస్టుకు 127, సోషల్ వర్కర్–38, స్టోర్ వర్కర్–50, కుక్ పోస్టుకు–26, హౌస్ కీపర్ పోస్టుకు–16, నైట్ వాచ్‌మన్ పోస్టుకు–19, ఎడ్యుకేటర్ పోస్టుకు–17, మ్యూజిక్ టీచర్ పోస్టుకు–7, యోగా టీచర్ పోస్టుకు–4 దరఖాస్తులు వచ్చాయి.

రామతీర్థంలో చాతుర్మాస దీక్ష ప్రారంభం

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామి వారి ఆలయంలో చాతుర్మాస దీక్ష బుధవారం ప్రారంభమైంది. ఏటా ఆషాడశుద్ధ ఏకాదశి మొదలుకుని కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నాలుగు నెలలు స్వామివారు యోగనిద్రలో, చాతుర్మాస దీక్షలో ఉంటారు. బుధవారం ఆషాడ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారి సన్నిధిలో విశ్వక్సేన ఆరాధన, శ్రీ సీతారామ శయన మూర్తులకు ప్రత్యేకమైన పల్లకిలో పవళింపు సేవ నిర్వహించారు.